క్లుప్తంగా

కృష్ణారావుకు ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే సింహాద్రి నివాళి



చల్లపల్లి: నిబద్ధత, కార్యాచరణ కలిగిన అధికారి మండవ కృష్ణారావు అని శాసన మండలి ఫ్లోర్‌లీడర్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం చల్లపల్లి మండలం నడకుదురు శివారు నాదెళ్లవారిపాలెంలో జిల్లా వ్యవసాయ శాఖ మాజీ అధికారి, ఆధ్యాత్మికవేత్త మండవ కృష్ణారావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం పారిశ్రామికవేత్త మండవ రవీంద్ర- రమణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణారావు చిత్రపటానికి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, సింహాద్రి రమేష్ బాబు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మారెడ్డి మాట్లాడుతూ అనేక జిల్లాల్లో వ్యవసాయ శాఖాధికారిగా విధులు నిర్వర్తించిన కృష్ణారావు రైతుల సంక్షేమానికి విశేష కృషి చేశారన్నారు. కృష్ణారావు చిత్రపటం వద్ద మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, ఇన్‌కం ట్యాక్స్ ఏపీ, తెలంగాణ, బరంపురం చీఫ్ కమిషనర్ కేవీఎస్ చారి, రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ వై.మధుసూదనరెడ్డి, రేంజ్ అధికారులు షేక్ ఆసిఫ్ షరీఫ్, సీహెచ్ సుజాత తదితరులు నివాళులర్పించారు.

నేడు సచివాలయం ప్రారంభం

కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెంలో నూతనంగా రూ. 43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ. 20.80 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తారని సర్పంచ్ కోసూరు అనూష తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

తలగడదీవి(నాగాయలంక): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ గ్రౌండ్స్‌లో గురువారం ఏడు మండలాల స్థాయిలో అండర్-14, అండర్-17 బాలికలకు జిల్లా స్థాయి ఎంపిక ఆటల పోటీలు నిర్వహించారు. 160 మంది పాల్గొనగా ప్రతిభ చూపిన 48 మంది విద్యార్థినులు వివిధ క్రీడల్లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.శివరామప్రసాద్ తెలిపారు. వీరిలో తమ పాఠశాల బాలికలు 15 మంది జిల్లాకు ఎంపికయ్యారని చెప్పారు.

దిశా యాప్‌పై అవగాహన

పెడన: దిశా యాప్ బాలికలకు, మహిళలకు రక్షణ కవచం వంటిదని, దిశా యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని తమను తాము రక్షించుకోవాలని మచిలీపట్నం దిశా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సుశీల అన్నారు. గురువారం బలిపర్రు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో దిశా యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్నప్పుడు దిశా యాప్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. మరో సబ్ ఇన్‌స్పెక్టర్ హైమావతి, ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన పవిత్రోత్సవం

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయకస్వామి వారి పవిత్రోత్సవం గురువారం రెండో రోజు కొనసాగింది. ఆలయంలో గురువారం ఉదయం, సాయంత్రం పూజాదికాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

షిర్డీసాయి మందిరం ప్రారంభం

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): వక్కపట్లవారిపాలెంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయి మందిరాన్ని గురువారం సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్ ప్రారంభించారు. నిర్మాణకర్తలు సాయి పురోహిత్ పద్మావతి, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు నేతృత్వంలో బాబావారి విగ్రహావాయు ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో జరిపారు. తొలుత సాయి కోటి నామ లిఖిత మహాయజ్ఞం, అఖండ సాయి నామ సంకీర్తన జరిగాయి. 10.30 గంటలకు మూడు కోట్ల సాయినామం గల సాయికోటి పుస్తకాలను గ్రామంలో ఊరేగించి సాయి పీఠం ఎదుట ప్రత్యేకంగా నిర్మించిన స్థూపంలో నిక్షిప్తం చేశారు. ఈ సందర్భంగా సామూహిక సాయి సత్య వ్రతం నిర్వహించారు. సాయిసేవక్‌లు ఎ.శ్యామ్‌సుందర్, వి. నాగపోతరావు పూజలు జరిపారు. బి.రాజశేఖరరెడ్డి, రమ్యశ్రీ, ఎస్.అశోక్ కుమార్, తేజశ్రీ గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

గణేశుని వసంతోత్సవం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని చిన్నూరులో ఆవుల, ముమ్మారెడ్డి ముఠాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో వినాయక ఉత్సవాలు ముగిశాయి. గురువారం స్వామివారి వసంతోత్సవం, నిమజ్జనం జరిగాయి. ఈ సందర్భంగా లడ్డూ ప్రసాదం వేలం వేయగా ముమ్మారెడ్డి శ్రీను రూ.33,600లకు దక్కించుకున్నారు. లడ్డూ తలపై పెట్టుకుని శ్రీనివాసరావు, మాధవి దంపతులు వసంతోత్సవంలో అగ్రభాగాన నడిచారు. నాగాయలంక పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు (చంటి), ముమ్మారెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), ఆవుల వెంకట కృష్ణారావు (బుడ్డబాబు), ఎం.శ్రీనివాసరావు, నాని తదితరులు పాల్గొన్నారు. నాగాయలంక ప్రసన్న గణపతి ఆలయంలో ఉత్సవ వేదికపై బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ, పవన్‌కుమార్ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవ వేదికపై ద్వాదశ హారతులు ఇచ్చారు.

అద్భుతం.. ఆహారం



సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్



ఆహా క్యాంటీన్‌లో విక్రయాలు

- రోగులకు బాసటగా ఆహా క్యాంటీన్
- ఆహార సమస్య తీరిందంటున్న రోగుల సహాయకులు
- అందుబాటులోకి రావడంతో ఆనందం
- త్వరలో బస్టాండ్‌లో కూడా ఏర్పాటు

మచిలీపట్నంటౌన్: డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. డ్వాక్రా మహిళల స్వయం ఉపాధి కోసం ఆహా క్యాంటీన్లు, అర్బన్ షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇవి డ్వాక్రా మహిళలకు ఉపాధి కల్పిస్తుండగా ప్రజలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. దీనిలో భాగంగానే జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్ రోగులతో పాటు వారి సహాయకులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అతి తక్కువ ధరలకు ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకులకు టిఫిన్, భోజనం ఇక్కడ అందుబాటులో ఉంటున్నాయి. ఐదు రకాల టిఫిన్లు, మూడు రకాల మెనూతో భోజనం అందుబాటులోకి వచ్చాయి. ఈ క్యాంటీన్ ఏర్పాటుతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే వారు టిఫిన్, భోజనాలకు దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి తొలగింది.

తక్కువ ధరలకు టిఫిన్లు, భోజనం

జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌లో టిఫిన్లు రూ. 20లు, భోజనం రూ. 40లకు అందిస్తున్నారు. టిఫిన్లలో గారె, మైసూర్‌బజ్జీ, మినపబజ్జీ, ఇడ్లీ, పూరి వంటివి అందుబాటులో ఉన్నాయి. అలాగే భోజనంలో కూర, పచ్చడి, పెరుగు ఇస్తున్నారు. మరో రోజు సాంబారు, పప్పు వంటి మెనూతో భోజనం విక్రయిస్తున్నారు. ఇన్ని రకాల టిఫిన్లు, భోజనం తక్కువ ధరకు అందిస్తుండటంతో ఆస్పత్రికి వస్తున్న పేదవర్గాల వారికి ఈ ఆహా క్యాంటీన్ బాసటగా నిలుస్తోంది.

వంటకాలు బాగున్నాయి



ఆస్పత్రికి వచ్చిన మేము దూరం వెళ్లి భోజనం, టిఫిన్ తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నాం. ఆస్పత్రిలో ఆహా క్యాంటీన్ పెట్టడం సౌకర్యంగా ఉంది. ఇక్కడి ఆహార పదార్థాలు రుచిగా ఉన్నాయి. దీనిని మరింత అభివృద్ధి చేయాలి.

– లక్ష్మి, పెదయాదర, బందరు మండలం

ఉపయోగంగా ఉంది



ఆస్పత్రికి దూరం నుంచి వచ్చిన మాలాంటి వారికి ఆహా క్యాంటీన్ ఉపయోగకరంగా ఉంది. భోజనం, టిఫిన్లు బయటకు వెళ్లి తీసుకురావడానికి ఎక్కడ దొరుకుతాయో తెలియని పరిస్థితి. ఆస్పత్రి ఆవరణలోనే క్యాంటీన్ పెట్టడంతో మా సమస్య తీరింది.

– వెంకటేశ్వరమ్మ, జరుగువానిపాలెం, కోడూరు మండలం

భక్తిశ్రద్ధలతో మిలాద్–ఉన్–నబీ వేడుకలు

పెడన: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పెడన పట్టణంలో ముస్లింలు గురువారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడివాడ రోడ్డులోని పెద్ద మసీదు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు, తిరిగి పెద్ద మసీదు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమన్నారు. ప్రపంచ శాంతే ధ్యేయంగా సర్వమానవాళి నడుచుకోవాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం, రాత్రి అన్నసమారాధనలు నిర్వహించారు. ర్యాలీలో వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు జోగి రాజీవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, టీడీపీ నాయకుడు కాగిత కృష్ణప్రసాద్, అయూబ్‌ఖాన్, మతీన్‌ఖాన్, బాబులాల్, నూరుల్లా, జఫరుల్లాబాషా, కరీం, అబ్దుల్‌హాజీం పాషి, జామియా మసీదు మత పెద్ద మహబూబ్ ఆలం, అబ్దుల్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

బందరులో శాంతి ర్యాలీ..

మచిలీపట్నంటౌన్: మొహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలను నగరంలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నగరంలోని అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం నగరంలోని జామియా మసీదు నుంచి ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి, జష్నే మిలాద్-ఉన్-నబీ కమిటీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, జామియా మసీదు అధ్యక్షుడు అంజత్‌పాషా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సద్‌రుద్దీన్, వైఎస్సార్ సీపీ నాయకులు మాదివాడ రాము, కార్పొరేటర్లు, ముస్లిం ప్రముఖులు, పలు రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు. ముస్లిం యువకులు వాహనాలకు పచ్చని, జాతీయ జెండాలను కట్టుకుని నగరంలో కలియ తిరిగారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా నగరంలోని కోనేరు సెంటర్‌లో, పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలతో పండుగ శోభ సంతరించుకుంది.



బంటుమిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



ఆకులమన్నాడులో ముస్లింల ర్యాలీ



మచిలీపట్నం ర్యాలీలో పాల్గొన్న పేర్ని కిట్టు, ముస్లింలు

బంటుమిల్లి: స్థానిక జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మసీద్ గురువు ముజఫర్ హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈద్గా మైదానంలో అన్నసమారాధన జరిగింది. కార్యక్రమాల్లో మసీద్, మిలాద్-ఉన్-నబీ కమిటీ సభ్యులు ఎండీ కమాల్‌బాషా, ఆలీం, నజీర్, సద్దాంహుస్సేన్, సత్తార్, బాషీ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: ఆకులమన్నాడులో నిర్వహించిన వేడుకల్లో మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, సర్పంచి మహ్మద్ రఫీ, నాయకులు ఫైజుల్ రహ్మాన్, గొరిపర్తి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో హజ్రత్ నిర్గన్‌షా అవులియా దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ యాసీన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మసీదులో మత గురువు హాఫీజ్ మహ్మద్ బషీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. గూడూరు సీహెచ్‌సీ డైరెక్టర్ ఎంఏ సలీమ్, జామియా మసీదు కోశాధికారి మహ్మద్ బషీర్, చిన్నమసీదు కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్, అబ్దుల్ మన్నాన్, అబ్దుల్ సమద్, మొహిద్దీన్, జహీర్ పాల్గొన్నారు.

గణపతి బొప్పా మోరియా

కోడూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. కోడూరులోని ప్రసన్న గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ లంబోదరుడి విగ్రహానికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేక వాహనంపై గణనాథుడిని ఉంచి కోడూరు వీధుల వెంట ఊరేగించారు. భక్తబృందాల మహిళలు మురళీ కోలాటం చేస్తూ భక్తిభావం చాటుకున్నారు. కోడూరు తూర్పు, లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలను ఉల్లిపాలెం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. విగ్రహాల ఊరేగింపు ముందు యువకులు డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలతో సందడి చేశారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మచిలీపట్నంటౌన్: గణనాథుని విగ్రహాల నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు నగరంలో గురువారం కొనసాగాయి. పందిళ్ల వద్ద ఉన్న గణనాథులకు పూజలు చేసి వాహనాలపై నిమజ్జనాలకు తరలించారు. నగరంలోని రాజుపేట లక్ష్మీగణపతి స్వామి ఆలయం వద్ద 15 అడుగుల కాణిపాక మట్టి గణనాథుడిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, ఐనం తాతారావు, ఆలయ భక్త కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. జలాల్‌పేటలోని వినాయకుని పందిరి వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో పెయ్యావుల దుర్గాప్రసాద్ రూ. 51,001లకు లడ్డూను దక్కించుకున్నారు.



కోడూరులో గణనాథుడి ఊరేగింపులో మహిళల కోలాటం



రాజుపేటలో గణపతి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న పేర్ని కిట్టు, కార్పొరేటర్లు

పెడన: వినాయక చవితి వేడుకలు గురువారంతో ముగిశాయి. గురువారం ఉదయం 15వ వార్డు మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయకుని పందిరిలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి చేతిలో లడ్డూకు వేలం నిర్వహించారు. అనంతరం గణనాథుడిని ఊరేగింపుగా మేళతాళాలతో నిమజ్జనానికి తరలించారు.

బంటుమిల్లి: స్థానిక ఆంధ్రా బ్యాంక్ సెంటర్‌లో లక్ష్మీగణపతి మోటారు యూనియన్ ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవ పందిరి వద్ద గురువారం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి తూర్పు వీధిలో ఏర్పాటు చేసిన గణేశుని విగ్రహం చేతిలోని లడ్డూకు వేలం నిర్వహించగా రూ. 4,200లకు వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు దక్కించుకున్నారు. గణనాథుడిని గురువారం సాయంత్రం డప్పు కళాకారుల సందడితో సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

విశ్వమానవ సమానత్వానికి జాషువా కృషి

మచిలీపట్నంటౌన్: తన రచనల ద్వారా సమాజంలోని మానవుల మధ్య సమానత్వం కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అని పలువురు వక్తలు పేర్కొన్నారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా దళిత జేఏసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక లక్ష్మీటాకీసు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గుర్రం జాషువా చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత జేఏసీ జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు (జానీ) మాట్లాడుతూ గుర్రం జాషువా సమాజంలోని మూఢనమ్మకాలు, వివక్ష, అంటరానితనం లాంటి సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా రచనల ద్వారా పోరాడారన్నారు. జాషువా జీవిత చరిత్ర నేటి కవులు, ప్రవచన కర్తలు, ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు.

కార్యక్రమంలో దళిత జేఏసీ జిల్లా కార్యదర్శి బేతపూడి రవి, నాయకులు బూరగ రామారావు, కొడమంచిలి చంద్రశేఖర్, కుంపటి జయకర్‌బాబు, మద్దెల పాండురంగారావు, అరిగెల సురేష్, దార్ల చెన్నకేశవరావు, దమ్ము కేశవ, ప్రత్తిపాటి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

పెడన: గుర్రం జాషువ జయంతి వేడుకలు మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ టీపీఓ వి. ఏసుబాబు మాట్లాడుతూ జాషువా రచనలు మతోన్మాద, కులతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉండేవన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సుందరం, గిరి, మనోహర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పెడనలో నివాళులర్పిస్తున్న ఏసుబాబు తదితరులు

ఆదర్శప్రాయుడు దోవారి వీరాస్వామి

ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: దేవదాయ ధర్మాదాయ శాఖలో ఈఓగా పనిచేసిన దోవారి వీరాస్వామి ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. స్థానిక పోర్టురోడ్డులోని వీరాస్వామి ఇంటి వద్ద ఆయన జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన వీరాస్వామి విగ్రహాన్ని ఆయన కుమారుడు, న్యాయమూర్తి అమన్‌రాజాతో కలిసి పేర్ని నాని గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. తన తండ్రి, మాజీ మంత్రి పేర్ని కృష్ణమూర్తితో వీరాస్వామికి స్నేహబంధం ఉందన్నారు. అదే బంధాన్ని ఆయన నాతోనూ కొనసాగించారని చెప్పారు. ఎంతో మందికి తన పలుకుబడితో సేవలు అందించినా ఏనాడూ ఎవరితోనూ ఈ విషయాలు చర్చించని మహోన్నత వ్యక్తి వీరాస్వామి అన్నారు. వైఎస్సార్ సీపీ 19వ డివిజన్ ఇన్‌చార్జి బూరగ రామారావు అధ్యక్షతన జరిగిన సభలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, బీసీ సంఘ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్ నాయుడు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, కార్పొరేటర్ యండ్రపాటి నాగేశ్వరరావు,వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్‌నోబుల్ మాట్లాడారు. కార్పొరేటర్ తిరుమలశెట్టి ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



వీరాస్వామి విగ్రహావిష్కరణలో పాల్గొన్న పేర్ని నాని, మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

లక్ష్యాల సాధనకు కృషి చేయండి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రీ-సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్న పాలవెల్లువ, ఇళ్ల నిర్మాణాలు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించి కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. జిల్లాకు సంబంధించిన పలు అంశాల పురోగతిని సీఎస్‌కు కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ఇప్పటి వరకు 90 శాతం పూర్తి చేశామన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి నూరు శాతం పూర్తి చేస్తామని చెప్పారు. పీఎం కిసాన్ ఈకేవైసీ 92 శాతం పూర్తయిందని, మిగిలిన భాగాన్ని పూర్తి చేసేందుకు కొన్ని సమస్యలు ఉన్నాయని చెప్పారు. కౌలుసాగు చేసుకునే రైతులకు జిల్లాలో ఇప్పటి వరకు 53,133 కార్డులు మంజూరు చేశామన్నారు. మానవతా దృక్పథంతో వారికి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు సూచించినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు పెద్దపీట

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని వి.కొత్తపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను రమేష్‌బాబు ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. మౌలిక వసతులైన తాగునీటి, రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. రైతులకు సకాలంలో సాగునీటిని అందించడం ద్వారా ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉందని, వరుణుడు కూడా కరుణించడంతో రైతులు ఆనందంగా ఉన్నారని రమేష్‌బాబు తెలిపారు. పీఆర్ ఏఈ విజయకుమార్, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, సర్పంచి యలవర్తి నాంచారయ్య, పీఏసీఎస్ చైర్మన్ రేపల్లె ఆదిశేషయ్య, రైతు సంఘం నేత రేపల్లె రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



రహదారి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

గూడూరు: ఆకులమన్నాడు ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులకు మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ గురువారం శంకుస్థాపన చేశారు. ఆకులమన్నాడు శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి రూ.20 లక్షలు తన ఎంపీలాడ్స్ నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, గూడూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఫైజుల్ రహ్మాన్, సర్పంచి మహ్మద్ రఫీ, పీఏసీఎస్ చైర్మన్ జంపాన పకీరు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, ముస్లింలు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చల్లపల్లి: శ్యాంకిషోర్ సేవలు ప్రశంసనీయమని ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా అన్నారు. గురువారం స్థానిక పడమరవైపు ఇస్లాంనగర్‌లో మిలాద్-ఉన్-నబీ పర్వదినం మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. అవనిగడ్డకు చెందిన శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిషోర్ నాయుడు ఆధ్వర్యంలో నిరుపేద ముస్లింలకు చీరలు పంపిణీ చేశారు. గౌసెపాక్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఉదయం ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

న్యాయమూర్తిపై సోషల్ మీడియాలో పోస్ట్ నిందితుడిపై కేసు

కోనేరుసెంటర్: చంద్రబాబు స్కిల్ స్కాం కేసులో ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును తప్పుబడుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన టీడీపీ కార్యకర్తపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రబాబు స్కిల్ స్కాం కేసుకు సంబంధించి ఏసీబీ కోర్టులో న్యాయమూర్తి డి. హిమబిందు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా న్యాయమూర్తి మనోభావాలు దెబ్బతినేలా పెనమలూరు నియోజకవర్గం కంకిపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త బొర్రా వెంకట్ ఈ నెల 14వ తేదీన ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టాడు. ఈ ఘటనపై న్యాయమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీసులు బొర్రా వెంకట్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

బంటుమిల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తామని ఎంపీడీఓ జె. స్వర్ణభారతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వి. చినబాబు అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో సమయానికి హాజరు కావాలని ఆమె కోరారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశంలో పాల్గొనాలన్నారు.